దరఖాస్తుల గడువు పొడిగింపు

సిటీ బ్యూరో, మార్చి 27(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ వ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరం పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువును పొడిగించామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రత్నం కోటాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ ఆపైన చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థులు మే 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కళాశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ప్రిన్సిపాళ్లు ప్రోత్సహించాలని కోరారు.

ఫ్లై ఓవర్ల నిర్మాణానికి మూడు కంపెనీలు

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): కేబీఆర్ చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ టెండర్‌ను దక్కించుకునేందుకు మూడు భారీ సంస్థలు పోటీ పడ్డాయి. రెండు ప్యాకేజీల్లో కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్ గేటు నుంచి జూబ్లీ చెక్ పోస్టు వరకు, బసవ తారకం హాస్పిటల్ మీదుగా అగ్రసేన్ విగ్రహం మీదుగా అండర్ పాస్, ఫ్లై ఓవర్లను రూ. 1090 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు జీహెచ్ఎంసీ టెండర్లు పిలిచింది. ఈ టెండర్లకు మూడు కంపెనీలు బిడ్లు దాఖలు చేయగా..అందులో మెగా, ఎన్‌సీసీ, ఎంవీఆర్ సంస్థలు ఉన్నాయి..టెండర్ ప్రక్రియలో భాగంగా సాంకేతిక బిడ్లు, ఫైనాన్స్ బిడ్లు తెరిచిన ఆనంతరం అర్హత కలిగిన కంపెనీకి సంబంధిత నిర్మాణ బాధ్యతలు అప్పగించనున్నారు. మరో వారం రోజుల పాటు సమయం పడుతుందని ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు.

తాను మరణించి..

భవేష్ సంతోష్ (ఫైల్)

ఖైరతాబాద్, మార్చి 27 : రోడ్డు ప్రమాదంలో గాయపడి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురైన ఓ యువకుడి అవయవాలు సేకరించారు వైద్యులు. జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని లాతూర్ మండలం పాపనాశ్ రోడ్డులో నివాసం ఉండే భవేష్ తివారీ (19) విద్యార్థి. ఈ నెల 23న బైకుపై వెళ్తుండగా, మరో బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భవేష్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, 26న బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. జీవన్‌దాన్ ప్రతినిధుల కౌన్సిలింగ్ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. భవేష్ తివారీ శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలను సేకరించారు.

స్టాక్ ట్రేడింగ్ మోసగాడు అరెస్టు

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఫైడిలిటీ ఇంటర్నేషనల్ వెల్త్ సెంటర్ పేరుతో స్టాక్ ట్రేడింగ్ మోసానికి పాల్పడతున్న ఓ వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన ప్రకారం... అహ్మదాబాద్‌కు చెందిన లలిత్ కుమార్ జైష్వాల్ వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి బాధితులను అందులో ఆటోమేటిక్‌గా యాడ్ చేస్తూ స్టాక్ ట్రేడింగ్‌లో లాభాలు వస్తున్నాయని తెలిపే స్క్రీన్ షాట్‌లను పంపుతూ పెట్టిన డబ్బుకు పదిరెట్లు లాభం వస్తుందని ఆశ చూపుతూ రూ.లక్షల్లో మోసాలకు పాల్పడుతున్నాడు. ఇప్పటి వరకు బాధితుల నుంచి రూ.6.2 లక్షలు కాజేశాడు. ఇతడిపై దేశవ్యాప్తంగా 13 చోట్ల కేసులు నమోదయ్యాయి. ఇతడి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, నాలుగు డెబిట్ కార్డులు, ఐదు చెక్కు బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సెర్చ్ ఆపరేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, ఎస్ఐ వెంకటేశ్, హెడ్ కానిస్టేబుల్ మహేశ్వర్‌రెడ్డి, కరీం, కానిస్టేబుళ్లు సంపత్, భాస్కర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నకిలీ డాక్టర్లు..

అర్హత లేకున్నా వైద్య సేవలు

- పేదల ప్రాణాలతో చెలగాటం
- 400 మందిపై కేసు నమోదు
- దాడులు నిర్వహిస్తున్న టీజీఎంసీ
- అయినా తీరు మారని వైనం

సిటీబ్యూరో, మార్చి27, (నమస్తే తెలంగాణ): ప్రస్తుత సమాజంలో తెల్లకోటు దొంగలు అధికమవుతున్నారు. కనీస అర్హత లేకున్నా నాడీ పట్టి కాసులు గుంజుతుండ్రు. ప్రస్తుత రోజుల్లో వైద్యం మరింత ఫిరం కావడంతో వృత్తిపేరు చెప్పుకొని నకిలీ దందాకు తెరలేపారు. వైద్యాన్ని వ్యాపారంగా మార్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వరుస దాడులు చేసినా, కేసులు పెట్టినా బెదరకుండా దాందా సాగిస్తూ, అమాయకుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు.

ఎన్ఎంసీ అనుమతిస్తేనే...

ఇటీవల కాలంలో హైదరాబాద్ ప్రాంతంలోని జీడిమెట్ల, మియాపూర్, దుండిగల్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, రామంతాపూర్, బీరప్పగూడ, ఉప్పల్, చింతల్, షాపూర్, ఐడీపీఎల్ మొదలైన ప్రాంతాల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులు నిర్వహించి నకిలీ వైద్యులను గుర్తించి కేసులు పెట్టారు. కేవలం ఫిబ్రవరి నెలలోనే జీడిమెట్ల, మియాపూర్ ప్రాంతాల్లోనే 10మంది నకిలీ వైద్యులపై కేసులు పెట్టారు. వీళ్లంతా కూడా ఫేక్ ధ్రువపత్రాలతో అర్హత లేని చదువులతో వైద్య రంగంలోకి ప్రవేశించారు. వాస్తవానికి మనదేశంలో వైద్యసేవలందించాలంటే కచ్చితంగా నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. కచ్చితంగా వైద్యుడుకాదలచినవారు ఎన్ఎంసీ గుర్తింపు పొందిన మెడికల్ కళాశాలనుంచి ఎంబీబీఎస్ పూర్తిచేయాలి. విదేశాల్లో ఎంబీబీఎస్ చేసినవారంతా ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. ఆ తరువాత ఏడాది పాటు కండీషనల్ ఇంటర్న్‌షిప్ తప్పనిసరిగా చేయాలి. ఎన్ఎంసీ లేదా ఎస్ఎంసీలో ప్రాక్టిస్ చేయాలంటే రిజిస్ట్రేషన్(డీఆర్ఎన్) తప్పనిసరిగా చేసుకోవాలి. అప్పుడే ప్రజలకు వైద్యం అందించేందుకు అర్హత లభిస్తుంది. కానీ అవేవి పట్టించుకోవకుండా ప్రస్తుతం ఎవరు పడితే వారే డాక్టర్లమంటూ చెప్పుకు తిరుగుతూ నకిలీవైద్యమందిస్తున్నారు. మెడికల్ కౌన్సిల్ జాబితాలో సుమారు 50,000 మంది వైద్యులు మాత్రమే రిజిస్టర్ చేసుకున్నారు. బయట మాత్రం గల్లీకో ఆసుపత్రి మనకు దర్శనమిస్తుండటం గమనార్హం.

చర్యల్లో వేగం పెంచాలి..

నకిలీ వైద్యుల కట్టడిలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మరింత వేగం పెంచాల్సిన అవసరం ఉంది. సామాన్యులు ఫిర్యాదులు చేస్తే తప్ప మెడికల్ కౌన్సిల్ దాడులు నిర్వహించడం లేదనే వాదన వినిపిస్తుంది. కేసులు పెట్టినా, చాలా ప్రాంతాల్లో దొంగ చాటు వైద్యసేవలు సాగుతూనే ఉన్నాయి. మెడికల్ కౌన్సిల్ గత కొన్నినెలల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 400 మంది నకిలీ వైద్యులను గుర్తించి కేసులు పెట్టింది. ఇందులో అధికశాతం మంది రాజధాని సమీప ప్రాంతాల్లోనే ఉంటున్నారు. వీరు వైద్యం చేయడమేకాకుండా పేరుమోసిన పలు కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఆ ఆసుత్రులిచ్చే కమీషన్లు తీసుకుంటూ వైద్యాన్ని వ్యాపారం చేస్తున్నారు. ఈ లెక్కప్రకారం కంటికి కనబడకుండా అర్హత లేని నకిలీలు ఎంతమంది ఉన్నారో చెప్పనక్కరలేదు. మెడికల్ కౌన్సిల్ దృష్టిసారించి చర్యలు వేగవంతం చేస్తేనే నాణ్యమైన వైద్యం సామాన్యులకు అందించిన వారవుతారు.

నిమ్స్, మహావీర్ దవాఖానలకు విరాళం

మహావీర్, నిమ్స్ దవాఖానలకు విరాళాన్ని అందజేస్తున్న హెచ్ఐసీసీ, నోవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ ప్రతినిధులు

మాదాపూర్, మార్చ్ 27: మాదాపూర్‌లోని నోవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్, హెచ్ఐసీసీ సంయుక్తంగా మహావీర్ హాస్పిటల్, నిజాం మెడికల్ సైన్సెస్ ఇనిస్టిట్యూట్‌కు రూ. 1.20 కోట్ల 80 వేలను వైద్య సదుపాయాలను మెరుగుపరిచేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిర్వహణ నిమిత్తం సహాయనిధిగా గురువారం అందజేశారు. ముఖ్య అతిథులుగా జాయింట్ వెంచర్ కంపెనీ బిజినెస్ హెడ్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ మధుసూదన్ రావు, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, మహావీర్ హాస్పిటల్ చైర్మన్ మహేంద్ర కుమార్ రంక, జనరల్ మేనేజర్ రూబిన్ చెరియన్ చేతుల మీదుగా విరాళాన్ని అందజేశారు. ఇందులో భాగంగా ఎఫ్వై 2024 -25 కోసం బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదించిన ఈ సీఎస్ఆర్ నిధిని వ్యూహాత్మకంగా విభజించి రూ. 60.80 లక్షలు మహావీర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్‌లో డయాగ్నొస్టిక్ లాబరేటరీ పునర్నిర్మాణం, ఆధునీకరణ కోసం కేటాయించగా, నిజాం మెడికల్ సైన్సెస్ ఇనిస్టిట్యూట్ ప్రత్యేక వైద్య పరికరాలకు కొనుగోలు కోసం రూ. 60 లక్షలు కేటాయించారు. సమాజ హితం, స్థిరమైన ఆరోగ్య సంరక్షణ అభివృద్ధికి నోవాటెల్, హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్, హెచ్ఐసీసీ విధానాలకు ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రంలో పదో తరగతి ప్రశ్నపత్రాల లీక్ అవ్వడాన్ని నిరసిస్తూ.. బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఎస్ఎస్సీ బోర్డు వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులు

ఎలివేటెడ్ భూ సేకరణకు బ్రేక్

మేడ్చల్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఎలివెటేడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణకు తాత్కాలిక బ్రేక్ పడినట్లయింది. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్‌ఫై ఓవర్(బ్రిడ్జి) భూ సేకరణలో తమ ఆస్తులు ఇవ్వమంటూ గ్రామ సభల బహిష్కరణతో పాటు బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించిన నేపథ్యంలో భూ సేకరణకు తాత్కాలికంగా నిలిపివేసి సాంకేతిక సమస్యలను అధిగమించే పనిలో అధికారులు నిమగ్నమైనట్లు సమాచారం. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో 12 కిలో మీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనుండగా, హైదరాబాద్ జిల్లా పరిధిలో 6 కిలోమీటర్లకు మేరకు నిర్మించనున్న విషయం తెలిసిందే. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు గ్రామ సభల నిర్వహణతో ఆస్తులు కోల్పోతున్న బాధితులు.. న్యాయస్థానాన్ని ఆశ్రయించడమే కాకుండా జరుగుతున్న గ్రామ సభలను తూంకుంట, పోతాయిపల్లి, హకీంపేటలకు చెందిన బాధితులు బహిష్కరించి నిరసనలు తెలిపారు. అయితే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సాంకేతిక సమస్యలను అధిగమించాకే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులకు ముందుకు పోవాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

మరింత ఆలస్యమయ్యే అవకాశం..

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల ప్రారంభానికి మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తున్నది. భూ సేకరణకు తమ ఆస్తులు ఇవ్వమని ప్రధానంగా 9 మంది ఆస్తులు కోల్పోతున్న వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారులు ఈ విషయమై ప్రభుత్వానికి లేఖ రాయగా, ప్రభుత్వం న్యాయస్థానంలో భూ సేకరణపై తేల్చనున్నట్లు తెలిసింది. ఇదంతా తేలడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో భూ సేకరణకు అవార్డు జారీ చేసేందుకు మరింత ఆలస్యం జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని శామీర్‌పేట రింగ్ రోడ్డు నుంచి లోతుకుంట వరకు లక్ష 12 వేల చదరపు అడుగుల భూమి, 385 నిర్మాణాలను భూ సేకరణ ప్రక్రియలో గుర్తించి మార్క్ అవుట్ చేసిన విషయం తెలిసిందే. అయితే సాంకేతిక సమస్యలను అధిగమించే వరకు గ్రామ సభలను నిర్వహించవద్దని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 2వందల ఫీట్ల స్థలం భూ సేకరణ గుర్తింపు ప్రక్రియ చేయగా, వంద ఫీట్ల స్థలం ఎలివేటెడ్ కారిడార్‌కు సరిపోతుందని ఆస్తులు కోల్పోతున్న వారు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. వంద ఫీట్ల స్థలం మాత్రమే భూ సేకరణ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

19 రోజులుగా.. క్యాబ్ డ్రైవర్ల ఆందోళన

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): యాప్ ఆధారిత వాహన రైడ్ ధరలు పెంచాలని డిమాండ్ చేస్తూ 19 రోజులుగా తెలంగాణ క్యాబ్ డ్రైవర్లు ఆందోళన చేస్తున్నారు. అందులో భాగంగా ఓల, ఉబర్, ర్యాపిడో యాప్‌ల డ్రైవర్లు ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను బహిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో పాటు నగర వ్యాప్తంగా నో ఏసీ ఉద్యమం సైతం కొనసాగిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ క్యాబ్ ట్రిప్పుల బహిష్కరణతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బంగారం, డాలర్లతో ఉడాయింపు

ఘరానా మోసగాడి రిమాండ్

శేరిలింగంపల్లి: బంగారం బిస్కెట్ల కొనుగోలు, విదేశీ కరెన్సీ ఎక్సేంజీ పేరిట అధిక కమీషన్ ఆశ చూపి ఘరానా మోసానికి పాల్పడిన నిందితుడు పుగల్ వాసన్(49)ను గురువారం గచ్చిబౌలి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గత శుక్రవారం గచ్చిబౌలిలో వ్యాపారులు చంద్రశేఖర్ నుంచి 500 గ్రాముల బంగారం, రఫీ నుంచి 18 వేల డాలర్లతో పారిపోయిన నిందితుడిని కోయంబత్తూర్ లో అక్కడి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సైబరాబాద్ ప్రత్యేక బృందాలు నిందితుడిని వెంటాడుతుండగానే తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేశారు. కోయంబత్తూర్ నుంచి పీటీ వారెంట్‌పై తీసుకొచ్చిన గచ్చిబౌలి పోలీసులు నిందితుడిని 10ఎంఎం ఆడిషనల్ కోర్టులో హాజరు పర్చగా.. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని సంగారెడ్డి జైలుకు తరలించారు. కేసు విచారణలో భాగంగా పుగల్ హసన్ ను కస్టడీకి ఇవ్వాలని గచ్చిబౌలి పోలీసులు కస్టడీ పిటీషన్ దాఖలు చేశారు. కోయంబత్తూర్ షింగనల్లూర్ ప్రాంతంలో నివాసం ఉండే పుగల్ హసన్ చేనేత వస్త్రాలు తయారు చేసే వ్యాపారం నిర్వహించేవాడు. గతంలో వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావడంతో బంగారం కొనుగోలు, కరెన్సీ ఎక్సేంజీ పేరిట మోసాలకు పాల్పడటం చేస్తున్నట్లు సమాచారం. పుగల్ హసన్ ను కస్టడీకి తీసుకొని పూర్తి స్థాయిలో విచారిస్తే ఎక్కడెక్కడ మోసాలకు పాల్పడ్డారనే విషయాలు వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు.

'అరెస్టులతో ప్రశ్నించే గొంతును నొక్కలేరు'

రాజాపేట, మార్చి 27 : సమస్యలపై ప్రశ్నించే గొంతుకను అక్రమ అరెస్టులతో నొక్కలేరని మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని గురువారం అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డిని ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచులు గ్రామాభివృద్ధి కోసం అప్పులు చేసి మరీ పనులు చేపట్టారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎయిరిండియా ఉద్యోగినికి చేదు అనుభవం

రెస్టారెంట్ నుంచి హోటల్ గది వరకు అనుసరించిన పోకిరి

వెంగళరావునగర్, మార్చి 27 : నగరంలో ఓ ఎయిరిండియా ఉద్యోగినికి చేదు అనుభవం ఎదురైంది. ఆ యువతిపై కామాంధుడు కన్నేశాడు. డిన్నర్ చేసుకుని రెస్టారెంట్ నుంచి తాను బస చేసిన హోటల్ కు వస్తున్న ఆ యువతిని కామాంధుడు వెంబడించాడు. రూమ్ లోకి వెళ్లిన యువతి కోసం ఆ కామాంధుడు పదే పదే డోర్ బెల్ మోగించడంతో భయాందోళనకు గురైంది. హోటల్ రిసెప్షన్ లో బాధితురాలు చెప్పడంతో హోటల్ సెక్యూరిటీ సిబ్బంది ఎస్ఆర్.నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేరళకు చెందిన ఎయిరిండియా ఉద్యోగిని(29) ఈనెల 23వ తేదీన అమీర్ పేట్ గ్రీన్ పార్క్ హోటల్లో బస చేసింది. ఈనెల 25వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో హోటల్లోని తులిప్ రెస్టారెంట్ లో డిన్నర్ చేసుకుని తన రూమ్ కు బయలుదేరింది. అదే హోటల్లోని రెస్టారెంట్ లో డిన్నర్ కోసం వచ్చిన ఓ వ్యక్తి ఆమెను వెంబడించాడు. ఆమె వెనకాలే రూమ్ వరకూ వచ్చాడు. దీంతో భయంతో తన హోటల్ రూమ్ లోకి వెళ్లి తలుపు గడియ బిగించింది. దీంతో ఆ యువతి ఉన్న రూమ్ బయట డోర్ వద్దకు వచ్చిన ఆ కామాంధుడు బెల్ మోగించాడు. భయాందోళనకు గురైన ఆ యువతి తలుపు తెరవలేదు. కొద్ది నిమిషాల పాటు అక్కడే ఉన్న ఆ వ్యక్తి ఆ రూమ్ లోకి వెళదామనుకుని కాపుకాసి అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. డోర్ బయట అలికిడి లేకపోవడంతో కామాంధుడు వెళ్లినట్లు గుర్తించిన బాధిత యువతి హోటల్ లోని రిసెప్షన్ కౌంటర్ లో ఫిర్యాదు చేసింది. దాంతో హోటల్లోని సీసీ కెమెరాల్ని పరిశీలించగా, ఎయిరిండియా ఉద్యోగినిని వేధింపులకు గురి చేసిన వ్యక్తి ఉప్పల్ కు చెందిన రాజశేఖర్ గౌరిగారిగా హోటల్ సిబ్బంది గుర్తించారు. దాంతో గ్రీన్ పార్క్ హోటల్ సెక్యూరిటీ మేనేజర్ వినోద్ టేకుమట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఆర్.నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎయిరిండియా ఉద్యోగినికి వేధించిన నిందితుడ్ని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ

మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, మార్చి 27: అసెంబ్లీ బడ్జెట్ 2025 - 26 సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, అనుభవలేమితో ప్రజలు అవస్థలు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బీజేపీ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ వారిని కాపాడుతూ అసెంబ్లీ లోపల బీజేపీ, కాంగ్రెస్ పార్టీల దోస్తీపై బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నిప్పులు చెరిగారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌తో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీజేపీ కాంగ్రెస్‌ల తీరును తీవ్రంగా ఖండించారు. బీజేపీ, కాంగ్రెస్ మొదటి నుంచి గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆపద వస్తే బీజేపీ ఎమ్మెల్యేలు రక్షణగా నిలుస్తున్నారని, ప్రభుత్వాన్ని నిలదీయాల్సింది పోయి ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తారా అని ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్,బీజేపీ బంధం బయటపడిందని, నిన్న అసెంబ్లీలో కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యేలు ఒక్కటయ్యారన్నారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బీజేపీ ఎమ్మెల్యేకు స్క్రిప్టు రాసి ఇచ్చారన్నారు. ఇరిగేషన్ పై ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పలేక బీజేపీకి స్క్రిప్టు ఇచ్చారని, కాంగ్రెస్ రాసి ఇచ్చిన స్క్రిప్టును బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు చదువుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని , ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ ఇస్తామని ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు.

హైవేపై రోడ్డు పనులు ఆగిపోయాయి

అసెంబ్లీలో మాట్లాడిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, మార్చి 27: ఉప్పల్ నియోజకవర్గం సమస్యలపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అసెంబ్లీలో గళం వినిపించారు. వరంగల్ - ఉప్పల్ హైవేపై ఉప్పల్ నారపల్లి మధ్య మూడేళ్లుగా రోడ్డు పనులు ఏమి జరగడం లేదని, బ్రిడ్జి పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆర్ అండ్ బీ మంత్రి రెండుసార్లు ఈ ప్రాంతానికి వచ్చి చూశారని, రెండు నెలల్లో పనులు జరిపిస్తామని చెప్పారని, పనులు జరగడం లేదని తెలిపారు. బ్రిడ్జి ఎప్పుడైనా కానివ్వండి కానీ కింద రోడ్డుపై బ్లాక్ టాప్ అన్నా చేయించాలని ఆర్ అండ్ బీ మంత్రిని సభ ద్వారా ఎమ్మెల్యే కోరారు. అలాగే నియోజకవర్గంలోని చర్లపల్లి, నాచారం, కుషాయిగూడల్లో ఉన్న పెద్ద చెరువుల సుందరీకరణ కోసం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సభలో కోరారు. ఇటీవల మహా కుంభమేళాకు నియోజకవర్గం నుంచి వేల మంది వెళ్లారని వారిలో 15 మంది వరకు మృతి చెందారని ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను నోట్ చేసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ బదులిచ్చారు.

హెచ్‌సీయూ భూ వేలంపై మాట్లాడండి

ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు వినతి పత్రం అందజేస్తున్న రాకేశ్‌దత్త

సిటీ బ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించడంపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం నాయకుడు రాకేశ్‌దత్త రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను కోరారు. హెచ్‌సీయూకు చెందిన విలువైన భూములను ప్రైవేట్ వారికి కట్టబెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, అలా జరుగకుండా చూడాల్సిందిగా గురువారం రాకేశ్ దత్త ఢిల్లీలో ఎంపీ రవిచంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యార్థులు, విశ్వవిద్యాలయ భవిష్యత్ అవసరాల కోసం ఉద్దేశించిన ఈ భూములను కాపాడేందుకు తాము చేస్తున్న పోరాటానికి అండగా నిలబడాలని కోరారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ వద్దిరాజు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

హామీలు అమలు చేయండి

సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన క్రైస్తవ సంఘాల నేతలు

హైదరాబాద్, మార్చి 26: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ క్రైస్తవ మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పలు క్రైస్తవ సంఘాల నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్, పాస్టర్స్ అసోసియేషన్ నేతలు బుధవారం సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్‌లో క్రైస్తవులకు ఎటువంటి నిధులను కేటాయించలేదని వారు ఆరోపించారు. ఇతర మతాలలోని వారికి ఇస్తున్నట్టుగానే క్రైస్తవ పాస్టర్లకు కూడా నెలవారి వేతనాలు ఇవ్వాలని కోరారు. బీసీ బిల్లులో క్రైస్తవ మైనారిటీలను కూడా చేర్చాలని అన్నారు. ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్ని మండలాల్లో క్రైస్తవులకు సమాధుల కోసం స్థలం కేటాయించాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో గోనె సాల్మన్, బెనోనీ రిచర్డ్, పురుషోత్తం, జయపాల్, కోట అనిల్ తదితరులున్నారు.

ఆర్టీసీ గుట్ట డిపో మేనేజర్‌గా మురళీకృష్ణ

డిపో మేనేజర్ మురళీకృష్ణను సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది

యాదగిరిగుట్ట, మార్చి 27 : ఆర్టీసీ యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌గా సీహెచ్ మురళీకృష్ణ గురువ